# 7.

# ఆత్మసత్యం - దేహమనిత్యం

ప్రాణాయామం ప్రత్యాహారం
నిత్యానిత్య వివేక విచారమ్
జాప్యసమేత సమాధి విధానం
కుర్వవధానం మహదవధానమ్

ప్రాణాయామము, ప్రత్యాహారము
నిత్యానిత్య వివేక విచారము
మంత్రముతోడ సమాధి విధానము
జాగ్రత్తగ నిశ్చలముగ చేయుము.

దివ్యాత్మ స్వరూపులైన విద్యార్థులారా!

ఆధ్యాత్మికమార్గమన్నది అగ్నితో చెలగాటము, బెబ్బులితో యుద్ధము వంటిది. ఏ కించిత్తు ఏమరపాటు జరిగినప్పటికిని పొంచుకొని ఉన్న మాయ సంసారమనే పొదలోకి లాగి మానవుని తబ్బిబ్బు పరచి మానవత్వాన్నే మరపింప చేసే ప్రయత్నానికి పూనుకుంటుంది. అట్టి స్థితియందు మానవుడు ఆధ్యాత్మిక మార్గమునందు ప్రవేశించుటకు పూర్వము ఈ ప్రాణాయామ ప్రత్యాహారముల యొక్క విశిష్టత గుర్తించుట అత్యవసరము. సాధనలు ఆంతరంగిక సాధన, బహిరంగ సాధన అని రెండు రకములు. మనము శ్రవణం, మననం, నిది ద్యాసలతోబాటు శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, వందనం , అర్చనం, దాస్యం,స్నేహం, ఆత్మనివేదనము అనే మార్గములన్నియు బహిరంగ సాధనలుగా నిరూపిస్తున్నాయి. అయితే ప్రాణాయామం, ప్రత్యాహారం మాత్రమే ఆంతరంగిక సాధనలు.

ప్రాణమును నిరోధించటమే ప్రాణాయామము యొక్క సాధన. మానవునియందు ఐదు ప్రాణములున్నవి. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము. ఈ ఐదు ప్రాణములు నిరోధింపచేసి తద్వారా అనేక రకముల అంతర్దృష్టిని అభివృద్ధి పరచుకునేటటువంటి ప్రయత్నానికి పూనుకోవటం ప్రాణాయామము యొక్క విశిష్టత. ఈ

srisathyasaivachanamrutam

ప్రాణాయామమునందు రేచక, పూరక, కుంభకమని మూడు రకములుగా ఉంటున్నవి. ప్రాణగతిని అపానగతిలో, అపానగతిని ప్రాణగతిలో, ప్రాణగతి అపానగతి ఈ రెండింటియందు కుంభకము చేసే పరిస్థితియందు ఈ మూడింటి మార్గములు నడుపుతున్నాయి.

ప్రత్యాహారమనగా బహిర్ముఖముగా నున్న ఇంద్రియముల భావములను అంతర్ముఖముగా చేర్చే ప్రయత్నమునకు పూనుకోవటం ప్రత్యాహారము యొక్క విశిష్టత. అనగా మనస్సు యొక్క కిరణములు ప్రాకృత దృశ్యములపై ప్రసరించటంచేత మనస్సు మాలిన్యము చెంది కేవలము విషయ సంబంధమైన వాంఛలయందు తనయొక్క రాగమును అభివృద్ధి పరచుకోవటం చేత వాడు బంధితుడౌతున్నాడు. అట్టి కారణంవల్ల ఈ మానసిక కిరణములను మనస్సువైపు మరల్చే ప్రయత్నమే ప్రత్యాహారము యొక్క అర్థము. అయితే, ఈనాడు అనేకమంది సాధకులు, పూర్తిగా తెలియనటువంటి గురువులను అనుసరించటం చేత ప్రాణాయామము మాత్రమే చేయుచు కొంతమంది లేక ప్రత్యాహారమును మాత్రమే అనుసరించుచూ కొంతమంది వారి నిత్యకృత్యముల లోపల కాలమును గడుపుతున్నారు. ఇది చాలా పొరపాటు. ప్రాణాయామము లేని ప్రత్యాహారము, ప్రత్యాహారములేని ప్రాణాయామము చేయటానికి వీలుకాదు. ప్రాణాయామం, ప్రత్యాహారం రెండు కూడను జంటలవంటివి. ఇవి రెండు బింబ ప్రతిబింబములవంటివి. ఒకటి లేక రెండవది చేసిన యెడల దాని ఫలసిద్ధి మనకు దక్కదు. మనస్సును అరికట్టినప్పుడే ప్రాణము కూడను వశమవుతుంది. ప్రాణమును అరికట్టినప్పుడే మనస్సు వశమవుతుంది. మనస్సు, ప్రాణము రెండింటి యందు దేహము చైతన్య స్వరూపకంగా నిలిచి ఉంటున్నది. కనుక, ఈ దేహ చైతన్యమును మనము స్థంభింపచేసే నిమిత్తమై మనస్సును లోదృష్టిగను, ప్రాణమును నిరోధించే ప్రాణాయామముగను రెండు ఆచరించినప్పుడే సమాధి సిద్ధి అనునది మనకు ప్రాప్తిస్తుంది.

ఇందులో నిత్యానిత్యవిషయ పరిశీలన ముఖ్యమైనదని రెండవలైను తెలుపుతున్నది. ఆ నిత్యానిత్య విషయ పరిశీలన చేసినప్పుడు ఆత్మ సత్యమని, దేహము అసత్యమని తేలుతూ వస్తుంది. ఆత్మవిచారణ చక్కగా సల్పినప్పుడు ఈ ఆత్మకు 'సత్యం శివం సుందరం' అనే సార్థకమైన నామములు కూడను ఉన్నవి. సత్యము లేని శివము, శివము లేని సుందరము ఉండటానికి వీలుకాదు. సత్యము యొక్క ప్రకాశమే శివము. శివము యొక్క విలాసమే సుందరము. సత్యము ప్రకాశము వంటిది. ప్రకాశము ద్వారానే ప్రకృతిని మనము

srisathyasaivachanamrutam

చూడగలుగుతున్నాము. ఈ చూపించే ప్రకాశమును చూడగలిగే వస్తువును రెండింటి యొక్క తత్వమును అర్థము చేసుకునే విషయమే విలాసమైన సుందరము. కనుక, సత్యం శివం సుందరం మిళితమైన స్వరూపమే ఆత్మ. ఈ మూడింటియొక్క తత్వాన్ని అర్థము చేసుకొని గుర్తించిన తరువాత మనము యింక చేయవలసిన సాధనలు యేమాత్రము ఉండవు. వంట అయిన తరువాత కట్టెలతో గాని నిప్పుతోగాని మనకు యేమాత్రము అవసరముండదు.

ఇంక మూడవ లైను "మనము సమాధి స్థితిలో పోయే పరిస్థితికి కొన్ని రకములైన మార్గములు మనము అవలంబించవలసి ఉంది" అని తెలుపుతుంది. ఈ సమాధి ఏవిధంగా మనకు సిద్ధిస్తుంది అంటే ఈ ప్రాణాయామం, ప్రత్యాహారం యొక్క చేరికతో మన యింద్రియములు స్థంభించిపోయి ప్రాణతత్త్వము వాంఛలను విసర్జించి కేవలము ఆత్మతత్వమునందే ప్రకాశమును అనుభవించటం చేత మనము ఈ యొక్క దేహములోని సర్వశక్తులు కూడను ఒక విధమైనటువంటి రీతిలో నిరోధింపబడతాయి. ఈ సమాధి కూడను కేవలము తెలియనటువంటి మూర్ఖత్వములోగాని ఏవిధమైన తెలివితేటలు లేని అంధకారముగాని ఉండకూడదు. "జాప్యసమేత సమాధి విధానం" అనగా జపముతో సహితమైన సమాధిగా ఉండాలి. జపమనగా ఒక మాలను చేతియందుంచుకొని, ఆ మాల యందున్న మణులను మాత్రమే త్రిప్పటము కాదు సతతం భగవచ్చింతనం జపం. నిరంతము భగవన్నామము ఉచ్చరించుచు, నాలుకతో కాకపోయినా మనస్సుతోనైనా ఉచ్చరించుతూ వుండటమే జపము. జపమనగా అది కూడా భజనగా మారిపోతుంది. జప-భజ ఈ రెండింటికి భేదము ఏమాత్రము పాటించకూడదు. నీవు మానసికంగా అంతర్ముఖముగా చేసుకున్నప్పుడు ఆ అంతర్ముఖమైన మనస్సు నిరంతరము భజించుచుండటమే జపసహితమైన సమాధి.

**సమాధి అనగా సమ-ధీ (సమ బుద్ధి)**

విద్యార్థులారా! ఈనాడు లోకములో అనేక రకములైన సమాధి స్థితులు బయలుదేరినవి. సమాధి అనేక కేవలము పడిపోవటమో లేక ఆ పడిపోయిన స్థితిలో ఏదో ఒక ఆధ్యాత్మిక భావముతో ఉద్రేకపూర్వకమైన పలుకులు పలకటమో లేక దేహమును అయోమయ స్థితియందు చేయించుకోవటమో, ఈ రకమైన పరిస్థితులను లోకములో సమాధి అని చలామణి అవుతున్నది. అయితే, ఈ unconscious లో వుండే సమయంలో లేక sub conscious లో ఉండే సమయంలో super conscious లో వుండే సమయంలో ఉండే

srisathyasaivachanamrutam

పరిస్థితి సమాధి అనిపించుకోదు. సహజమైన స్థితిలో ఉండియే ఆ సమాధి యొక్క ఆనందమును అనుభవించటానికి తగిన ఆనందములు కలుగుతుంటాయి. అట్టిది సరైన, చక్కని సమాధి అని చెప్పటానికి వీలవుతుంది గాని ఏదో పడిపోయి unconscious లో వుండటం సరైన సమాధి కానేరదు. హిస్టీరియా ఉండవచ్చును. Emotion ఉండవచ్చును లేక ఫిట్స్‌గా ఉండవచ్చును లేక యింకేవిధమైన వ్యాధిగా ఉండవచ్చుగాని దానిని సమాధి అని చెప్పటానికి సాధ్యము కాదు. అలాంటి స్థితులనంతా మన భారతీయులు సక్రమమైన మార్గములో గుర్తించుకొనలేక యిట్టివాటినే సమాధి అనే రూపముతో అందించటానికి పూనుకోవటం చేతనే ఈ పవిత్రమైన సమాధి స్థితులుగాని, ప్రాణాయామ ప్రత్యాహారముల పరిస్థితులుగాని, జపతపముల యొక్క విశిష్టతలు గాని గౌరవానికి గురికావటం లేదు. కనుక, మనము ఈనాడు సత్యమైన మార్గమును నిత్యమైన స్థితిని, పవిత్రమైన భావమును మనము అర్థము చేసుకోవటానికి ప్రయత్నం సల్పాలి. పదములయొక్క అర్థములే పదార్థములుగా ఉండే స్థితిలో పదార్థములకు మరి వేరే పేర్లు మాత్రము ఉండవు. పదముకు ఉన్న అర్థమే పదార్థము. కనుక, సమాధి అనే పదములోనున్న అర్థమే స్వరూపము. అనగా సమ-సమస్థితిలో, ధీ-బుద్ధి. సమబుద్ధి స్థితిలో ఉండేది సమాధి. ఇది సహజమైన జీవితములో అనుభవించుకోవటానికి వీలవుతుంది. ఎప్పుడు? ప్రాణాయామ, ప్రత్యాహార పూర్ణ స్వరూపాన్ని మనము అనుభవించినప్పుడు సహజ స్థితిలో లోకముతో ఉండికూడను, సర్వమును చూచుచూ, సర్వ పరిస్థితుల యందు మనము అనుభూతిలో వుండికూడను వారికి ఏమాత్రము సంబంధము లేని స్థితిలో ఉంటాము. మనస్సు అంతర్ముఖము గావించినప్పుడు ఆత్మదృష్టియందే మనస్సు ఉంటుందిగాని ప్రకృతిపై ప్రసరించటానికి యేమాత్రము వీలుండదు. కనుక ప్రకృతియొక్క స్వరూప స్వభావములంతా విసర్జించి ఆత్మలక్ష్యమునందే వుంటుంది మనస్సు. అట్టి స్థితిలో సుఖదుఃఖములుగాని, కష్టనష్టములుగాని, చల్లదనము వేడితనముగాని ద్వంద్వములకు అతీతమైన స్థాయిలో ఉండటంచేత సమాధి అని పేరు వచ్చింది. వ్యక్తిగా ప్రపంచములో సంచరిస్తున్నప్పటికిని, సమాజముతో సంబంధముగా కల్పించుకున్నట్లుగా మనకు తోచినప్పటికి, అతని యొక్క మనస్తత్వము ఈ ప్రపంచమునకుగాని, సమాజమునకు గాని ఎట్టి సంబంధము లేనట్టిదిగా వుంటుంటాది. చూపరులకు మాత్రము దాని స్వభావము

srisathyasaivachanamrutam

అనేకరకములుగా భావించుకోవచ్చును. తనకు తాను నిరంతరము ఆత్మ లక్ష్యమునందే ఉంటుంటాడు. ఎట్లనగా బురదలోనున్నటువంటి పురుగు బురదయందు ఉండినప్పటికిని ఆ బురద తనకు అంటుకొనని పురుగులు కొన్ని ఉంటుంటాయి. అలంకారనిమిత్తమై ఆడవారు కంటికి కాటుక పెట్టుకుంటారు. అలంకారముగా కాటుక కనిపిస్తుందిగాని, కంటిగుడ్డుకు కాటుక అంటుకోదు. అనేకరకములైన జిడ్డు పదార్థములు నాలుకతో మనము భుజిస్తున్నాము. ఎన్ని పదార్థములు చేతితో తీసుకొని నాలుకయందు ఉంచుకున్నప్పటికిని చేతికి జిడ్డు తగులుతుందిగాని, నాలుకకు జిడ్డు ఉండదు. కొలనులోనున్న తామరపుష్పము నీరు లేక ఒక్క క్షణమైనా జీవించటానికి సాధ్యము కానప్పటికిని నీరును మాత్రము తాను చేర్చుకొనక వుంటుంది. ఈ కమలము వంటిది, కన్నులవంటిది, నాలుక వంటిది సమాధిస్థితి. కనుక, సమాధిస్థితిని యిట్టి పరిస్థితిలో మనము తెలుసుకోటానికి 'కురు అవధానం మహదవధానం' యిది నాలుగవ పదము. తొందరపడక ఓపికతో నిశ్చలమైన భావముతో, ఒక ప్రశాంతమైన హృదయముతో విచారించు. అంతేగానీ తొందరపడి ఏదో ఒక విధమైన ఆరాటముతో, దురాశతో దీనిని పొందాలనే ఆతృతతో నీవు యిందులో ప్రవేశించటానికి పూనుకోవద్దు. ఈనాడు ఒక మొక్కను నాటుతున్నాము. మొక్కను నాటిన తక్షణమే ఫలమును మనకు అందించదు. ఆ మొక్క వృక్షము కావటానికి కొంత కాలము తీసుకుంటుంది. ఆ కాలము తీసుకున్న తదుపరే ఆ ఫలమును మనకందిస్తుంది. పైరు ఈనాడు పెట్టిన తక్షణమే రేపటి దినమునే మనము ధాన్యమును యింటికి తెచ్చుకోవటానికి వీలుకాదు. పైరు ధాన్యముగా మారటానికి కొంతకాలము తీసుకుంటుంది. కానీ, ఈనాటి యొక్క సాధకులు మొక్కనాటిన తక్షణమే ఫలము కావాలని ఆశిస్తున్నారు. పైరు పెట్టిన తక్షణమే పంటరావాలని ఆశిస్తున్నారు. ఇట్టి దురాశకు మీరు గురికాక, తొందరకు, తొట్రుపాటుకు యేమాత్రము అవకాశమివ్వక శాంతముతో, ఓపికతో, సహనముతో ప్రసన్న హృదయముతో దీనికి మీరు కాచుకొని ఉండండి గాని తొందరపడకూడదని "కురు అవధానం మహదవధానం" అని శంకరుల వారు ఈ భజగోవిందశ్లోకములో నాల్గవ పదముగా ఉచ్చరించాడు. ఇందులో అనేక మంది వేదాంతమును ఆశించి, ఆచరించి, దానిని అభీష్టముతో తత్త్వాన్ని గుర్తించు కున్న వ్యక్తులకు కూడను కొన్ని కొన్ని సందేహములు కలుగుతుంటాయి. బ్రహ్మము, ప్రకృతి యీ

రెండింటియందు ఏకత్వము చూడటం సాధ్యముకాదు కదా! బ్రహ్మమునకు భిన్నముగానున్న సమయములో బ్రహ్మ, ప్రకృతి కూడను ఏకమయ్యే మార్గము ఏరీతిగానున్నది, కావటానికి వీలులేదేయని అపోహలతో వారు కుములుతుంటారు. దృశ్యమునకు భిన్నముగా కనిపించుచున్నదిగాని, అంతరార్థమునందు మనము చక్కగా విచారణ సల్పినప్పుడు అందులో ఏకత్వమే మనకు స్పష్టమవుతున్నది. దీనికి చిన్న ఉదాహరణము. ఒక విత్తనము ఉన్నది. ఆ విత్తనము మనము మట్టిలోపెట్టి, నీరునుపోసి సరైన రీతిగా కాపాడినప్పుడు ఆ విత్తనము మొక్కగా బయలుదేరి అదే వృక్షముగా వచ్చి, అదే చిగుళ్లు వేసి, పుష్పములుగా వికసించి, ఫలములుగా మనకందించి స్వరూపకముగా నిరూపణ యిస్తున్నది. అయితే ప్రకృతి గుణదోషములవల్ల ఇది మొక్కగాను, వృక్షముగాను, కొమ్మలుగాను, రెమ్మలగాను, ఫలములుగాను చూపించుచున్నవి గాని, ఆధ్యాత్మిక దృష్టియందు దీనిని చక్కగా చెప్పినప్పుడు ఏవిత్తనము మట్టిలో పెడితిమో ఆ మట్టియే మొక్కగా, మట్టియే కొమ్మలుగా, మట్టియే ఆకులుగా, మట్టియే ఫలములుగా వున్నది. ఫలములు, పుష్పములు, కొమ్మలు, రెమ్మలు, ఆకులు అన్నీ మట్టి మయమేగాని మట్టి రూపము విడిచి వేరు రూపాన్ని యివి పొందలేదు. కనుక, మట్టినుండి పుట్టిన చెట్టు మట్టియే గాని చెట్టు కాదు. అదేవిధముగా బ్రహ్మ నుండి పుట్టిన ప్రకృతి బ్రహ్మయేగాని ప్రకృతి కాదు. మనకు ఆకారంగా ప్రకృతి గోచరిస్తున్నాదిగాని, గోచరించే ప్రకృతి బ్రహ్మస్వరూపమే అనే సత్యాన్ని వేదాంతము బలపరుస్తుంది. ఇట్టి సత్యాన్ని మనము గుర్తించటానికి గ్రహణసిద్ధి, లక్ష్యము ఈ రెండూ అత్యవసరము.

**లక్ష్యముపై మాత్రమే దృష్టి**

లక్ష్యము అనే దానికి చిన్న ఉదాహరణము. మహాభారతములో ద్రోణాచార్యుడు పాండవులకు విలువిద్య నేర్పించే నిమిత్తమై ఒక వృక్షముకు పక్షిని కట్టి ఈ పాండవులను ఒకరితరువాత ఒకరిని పిల్చి పక్షిని కొట్టటానికి ఆజ్ఞ యిచ్చాడు. అప్పుడు ఒక్కొక్కరు ఆ ప్రదేశమునకు వచ్చి తాము కొట్టుటకు సంసిద్ధముగా నున్నప్పుడు ద్రోణాచార్యుడు కొన్ని ప్రశ్నలు వేసేవాడు. 'భీమా! ఇప్పుడు నీకు ఏమి కనిపిస్తున్నది?' అని ప్రశ్నించాడు. ఆ భీముడు బలవంతుడు కదా! తనకు ఎక్కువ తెలివితేటలున్నవని ప్రదర్శించు నిమిత్తమై 'గురూజీ! వృక్షము కనిపించుచున్నది, పక్షి కనిపించుచున్నది. పక్షికి కట్టిన త్రాడు కనిపించుచున్నది. దాని వెనుక ఆకాశము కనిపించుచున్నది' అని విఱ్ఱవీగాడు. 'సరే! నీకు యిన్ని కనిపించినప్పుడు, నీవు దృష్టిని ఏకాగ్రత పరచుకోలేదు, ప్రక్కన కూర్చో! అన్నాడు.



srisathyasaivachanamrutam

అదేవిధముగా ముగ్గురు అన్నదమ్ములను పిలిచాడు. మిగిలిన వారు భీమునికంటె యింకా అధిక పదార్థాలే గుర్తించుకుంటూ వచ్చారు. అర్జునుడు వచ్చాడు. అర్జునుని ఈ ప్రశ్న వేసినప్పుడు అర్జునుడు చెప్పాడు, 'ఒక్క పక్షి తప్ప నాకు ఏమీ కనిపించటం లేదు' అన్నాడు. తాను విద్యను నేర్చుకోవాలి అనే శ్రద్ధ వున్న వ్యక్తి దేనిని నేర్చుకోవాలని ఆశపడుతున్నాడో దానిపైన మాత్రమే లక్ష్యము వుంచటమే లక్ష్యసిద్ధికి సరియైన అర్థము. ఈనాడు నేర్చుకోవాలి అనేది ఒకటి, దానికి లక్ష్యములు అనేకములు. ఈ రకంగా రావటంచేత మనము పొందవలసిన దానిని పొందలేకపోతున్నాము, చేరవలసిన దానిని చేరలేక పోతున్నాము. అర్జునుని వంటి లక్ష్యము మనము పెట్టుకోవాలి.

## గుణదోషములను బట్టియే మంచి చెడ్డలు

ఇంక గుణగ్రహణమునకు కూడా మహాభారతములో చిన్న ఆదర్శము. ఒకానొక సమయమునందు పరీక్షించగోరి కృష్ణుడు దుర్యోధనుని పిలిపించాడు. యుద్ధమునకు ముందే సఖ్యముగానున్నప్పుడు. "దుర్యోధనా! నేను ఒక ఘనకార్యము చేయాలని సంకల్పించాను. అట్టి ఘనకార్యములో మంచి గుణవంతుడైన వ్యక్తి అవసరము, ప్రపంచములో మంచి గుణవంతుని వెతికి తీసుకొనిరా" అని చెప్పాడు. దుర్యోధనుడు వెళ్లి కొన్ని దినములు ప్రపంచమంతా వెతికాడు ఎక్కడా మంచివాడు చిక్కలేదని కృష్ణుని దగ్గరకి వచ్చి 'స్వామీ! జగత్తులో గుణవంతుడైన వాడు ఎవ్వడూ నాకు కనిపించలేదు. అందరి గుణములయందు యేదో దోషములు నాకు గోచరిస్తున్నాయి. నీవు గుణవంతుడు కావాలని కోరుతున్నావు. కనుక ఉన్నవారిలో గుణవంతుడు వీడు ఒక్కడే యింక ఎవరు గుణవంతులు లేరు' అని తనను తాను చూపుకున్నాడు. సరే నీతోనే నాపని చేయించుకుంటానని చెప్పి ఒక చోటికి పంపించాడు. తదుపరి ధర్మజుని పిలిపించాడు. 'జగత్తులో ఎక్కడైనా వెదికి, గుణహీనుడైనవాడు, మహాఛండాలుడైనవాడు, హీనుడు, అతనికంటె చెడ్డవాడు ఎవరూ లోకములో లేకుండా వుండేవానిని ఎవరినైనా వెదికితెస్తావా' అని ఆజ్ఞ యిచ్చాడు. ధర్మజుడు కూడను ప్రపంచమునంతా గాలించాడు. కట్టకడపటికి ఒక్కడే వచ్చాడు. 'కృష్ణా! చెడ్డవారు నాకు ఎక్కడా కనిపించలేదు. అందరియందు ఉత్తమమైన గుణములే నాకు కనిపిస్తున్నాయి. ఇంకా ఏమైనా అంతో యింతో చెడ్డ గుణములుంటున్నాయంటే ఈ ధర్మజునియందు మాత్రమే ఉండవచ్చును గాని నాకు చెడ్డవారు ఎవరూ జగత్తునందు లేర'ని నమస్కారము

srisathyasaivachanamrutam

చేశాడు. దుర్యోధనుడు మంచివారు లేరని చెప్పటానికి, ధర్మజుడు చెడ్డవారు లేరని చెప్పటానికి ఈ లోకము ఆధారము కాదు. వారి యిరువురియందున్న గుణ దోషములే ఆధారము. ఈ గుణదోషములు పురస్కరించుకొనియే మంచి చెడ్డలు బయలుదేరుతున్నాయిగాని మంచిని వెతకటానికిగాని, చెడ్డను నిర్ణయించ టానికిగాని ఎవ్వరికి సాధ్యము కాదు. ఆవిధంగా వెతికి నిర్ణయము చేసే అధికారము ఎవ్వరికీ లేదు. కనుకనే, గుణములను మనము పరిశుద్ధ భావముతో అభివృద్ధి పరచుకొని మనయొక్క తత్త్వాన్ని ఈ దివ్యత్వములోపల లీనమొనర్చుకునే నిమిత్తమై మనయొక్క విశ్వాసమును మనము బలపర్చుకొని ఆధ్యాత్మిక మార్గమందు ప్రవేశించి మన గుణములలోనున్న దోషములను పరిహారము చేసుకోవాలని ఆశిస్తూ, వర్షము వచ్చే సూచనలంతా వుంటున్నాయి కనుక నా ప్రసంగాన్ని యింతటితో ముగిస్తున్నాను.

**(తేదీ 26-05-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam